## 22

# ఎండని చేప

అనగా అనగా ఒక రాజుగారు. రాజుగారి ఆస్థానంలో ఏడుగురు కవులు. ఏడుగురు కవులు దేశసంచారానికి వెళ్లారు. దేశ సంచారానికి వెళ్లి ఏడు కవితలు రాసుకొచ్చారు. ఏడు కవితలు తెచ్చి ప్రజల ముందు పెట్టారు. అన్నీ అర్థమయ్యాయి. ఒక్క కవిత అర్థం కాలేదు.

"కవితా ! కవితా ! ఎందు కర్థం కాలేదు ?"

"అంతా అస్పష్టత కదా ! పండిత విమర్శకుడు నా 'త-రాత' రాయలేదు. అంటే తలరాత రాయలేదు."

"విమర్శకా ! విమర్శకా ! రాతెందుకు రాయలేదు ? అర్థమెందుకు విప్పి చెప్పలేదు ?"

"కవిగాడు మందు కొట్టించలేదు."

''కవిగా! కవిగా! మందెందుకు కొట్టించలేదు?''

"పుస్తకాలమ్ముకున్నాడే గాని, డిస్ట్రిబ్యూటరు డబ్బివ్వలేదు?"

"డిస్టిబ్యూటరూ/ పబ్లిషరూ డబ్బెందు కివ్వలేదు ?"

"పాఠకుడు పుస్తకాలు కొని చదవలేదు మహాప్రభో ! కాపీలన్నీ అలాగే ఉన్నాయ్ -"

"పాఠకుడా ! పాఠకుడా ! పుస్తకం కొని ఎందుకు చదవవ్?"

"కవిగారే స్వదస్తూరీతో కాంప్లిమెంటరీ ఇచ్చారండీ ! ఇంకెందుకు కొనడం వేస్ట్ -"

(హార్నీ ! మళ్ళీ కవిగారి దగ్గర కెళ్ళాలా రివర్స్ గేర్‌తో -)

"కవిగారూ ! కవిగారూ ! కాంప్లిమెంటరీ కాపీలు ఎందుకిచ్చారు ?"

"బంగారు నా పుస్తకాలు అటకమీద చెదలు తిని పోతుంటే మరి ఇవ్వనూ ?"

"సరి సర్లెండి. పాతకథ స్టైల్లో కతలు చెప్పొద్దు. అసలు విషయం చెప్పండి."

"నా కవిత్వంలో అస్పష్టత ఉందని, పనికిరాని విప్లవ పద జాల ముందని, జరీలేని ఇమేజరీ ఉందని నానా మాటలన్నారు. వళ్లు మండి కనిపించిన ప్రతివాడినీ వెంటాడి వేటాడి కాంప్లిమెంటరీ లిచ్చాను. పుస్తకం తీసుకున్న మిత్రుడు ఒక్కడూ అభిప్రాయం చెప్ప లేదు !"

"కాంప్లిమెంటరీ పుచ్చుకున్న కవిగారి మిత్రుడా - ఆ కావ్యం చదివావా నాన్నా !"

"లేదు సార్ ! ఫుట్‌పాత్‌మీద అమ్మేశాను. ఆఫ్ రేట్‌లో ఐదు రూపాయలొచ్చాయి. సరదాగా కాఫీ తాగాం. కవిత కన్నా కాఫీ నయం. తలనొప్పి తగ్గిస్తుంది."

(ఛఛ. ఈ ట్రాక్ బాగులేదు. అసలు రాజుగారిని కలిసి విచా రిస్తే పోతుంది. కవిని కవితను ఏం చేశాడో పాపం !)

"అర్థం కాని ఆ అస్పష్ట కవిని ఏం చేశారు ప్రభూ-"

"ప్రజా కవిని చేశాం !

లక్ష వరహాల సాహితీ పురస్కార మందించాం."

"అవ్వ - ప్రజాకవా ? ప్రజాకవి అని ప్రజలు పిలుచుకోవాలి గాని, ప్రభువుల వారే అలాంటి బిరుదులు ఇవ్వడమేమిటి ఆర్యా ! - ఈ కవిగారి రచన ఒక్కటి కూడా ప్రజలకు చేరలేదు. వారేం రాశారో కూడా ప్రజలకు గుర్తు లేదు. వీరిని ప్రజాకవి అంటే ప్రజలు ఎలా ఒప్పుకుంటారు ?"

"ప్రజలు గొర్రెలు. మేం ఎవరికేం బిరుదులిస్తే వారు, వాటినే తగిలించి గౌరవిస్తుంటారు"

"ప్రభూ ! మీరు ఒక నిజం తెలుసుకోక తప్పదు. ప్రజలు గొర్రెలు కాదు. కవుల్ని కూడా మామూలు మనుషుల్లో కలపడం అన్యాయం''

"కలపలేదు. అందుకే తక్కువ స్థాయిలో ఉంచాం !! కవి కావడం కన్నా, మనిషి కావడం కష్టం అని మా పూర్వీకులు చెప్పే వారు- అయితే ఈ కాలంలో మా 'రూక' బలమెంతో మాకు తెలుసు. తిరుగుబాటు, విప్లవం అని అరిచే వాళ్ళను ఇటు పట్టుకు రండి. రెండు ఇంక్రిమెంట్లకు నోర్లు మూసుకుంటారు. సభల్లో బాగా అరిచేవాడికి ఏదో ఓ బహుమతి ప్రకటిస్తాం. పదో పరకో వేలల్లో పడేస్తాం. అంతే ఇక - జో హుకుం గాళ్లై పడి ఉంటారు. మీ కేమైనా అనుమానమా? మా రాజ్యంలో అలాంటి వారిని పట్టి తెప్పించమంటారా ? సాంపుల్‌గా పరిశీలిస్తారా ? పరిశోధిస్తారా ?''

"ఆర్యా ! మీకు బతికుండి చనిపోయిన కవులు తప్ప, చనిపో యినా బతికి ఉండే కవులు కనరారా ? అట్లాంటివారిని పట్టించుకోరేం? వారు కూడా ఉన్నారని తెలుసుకోరేం?"

"ఆఁ య్ ! ఎవరక్కడ ?''

"చిత్తం దేవర''

"ఎవడు వీడు ? మమ్మే ప్రశ్నించువాడు. ప్రజాస్వామ్య పరి రక్షకులం గనక మిన్నకున్నాము. పట్టి బంధించండి. ఎన్‌కౌంటర్ చేసెయ్యండి. వెధవ ప్రశ్నలూ వీడూ . నక్క వినయాలు ధూర్త లక్షణాలు.... ఆఁయ్ - ఈ రోజుకు ఇక చాలు.

సభ చాలిస్తున్నాం -

ఇంకెవ్వరికీ దర్శనమివ్వం -

క్లోజ్ ! -

ఆఁ - మా మీస మేదీ ?

ఇటు అందించండి -

కాస్త తిప్పుకోవాలి ?!''

- మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు....

○

మే, 1992